# నల్లగొండ జిల్లాలో 85.71%పోలింగ్

అత్యధికంగా అప్పుడు, ఇప్పుడూ మునుగోడునే..
రాష్ట్రంలోనే 91.89శాతంతో మునుగోడు టాప్
నల్లగొండలో నమోదైన 81.60 శాతమే అత్యల్పం
జిల్లాలో 12,54,799 మంది ఓటు హక్కు వినియోగం
మహిళల కంటే పురుషుల ఓటింగే ఎక్కువ

## 2018తో పోలిస్తే 1.11శాతం తగ్గుదల

తెలంగాణ రాష్ట్రం ఏర్పడే సమయంలో 2014లో జరిగిన ఎన్నికల్లో నల్లగొండ జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పోలింగ్ శాతం 78.31కాగా, 2018 ఎన్నికల్లో 8.41శాతం పెరిగి 86.82శాతంగా నమోదైంది. ప్రస్తుత పోలింగ్ కిందటి సారికి అటూఇటుగా తేలింది. గత ఎన్నికలతో పోలిస్తే 1.11 శాతం తగ్గింది. ఈ సారి మొత్తంగా 85.71శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో అత్యధికంగా మునుగోడు నియోజకవర్గంలో 91.89శాతం నమోదు కాగా, రాష్ట్రంలోనే టాప్‌గా నిలిచింది. జిల్లాలో అత్యల్పంగా నల్లగొండ నియోజకవర్గంలో 81.60 శాతం నమోదైంది. 2018తో పోలిస్తే 2.53శాతం తక్కువగా ఉన్నది. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే మునుగోడు తర్వాత నకిరేకల్‌లో 86.67శాతం, నాగార్జునసాగర్‌లో 85.79, దేవరకొండలో 84.49, మిర్యాలగూడలో 83.49శాతం నమోదైంది. పట్టణ ఓటర్లు ఎక్కువగా ఉన్న నల్లగొండ, మిర్యాలగూడల్లో కొంత పోలింగ్ శాతం తక్కువగా కనిపిస్తున్నది.

– నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ)



మునుగోడు మండలం కొంపెల్లి హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు (ఫైల్)

**జిల్లాలో నమోదైన ఓట్ల వివరాలు**

| జెండర్ | మొత్తం ఓట్లు | పోలైనవి | పోలింగ్ శాతం |
|---|---|---|---|
| పురుషులు | 7,26,169 | 6,27,521 | 86.42 |
| మహిళలు | 7,37,789 | 6,27,201 | 85.01 |
| ట్రాన్స్‌జెండర్ | 122 | 77 | 63.11 |
| మొత్తం | 14,64,080 | 12,54,799 | 85.71 |

**జిల్లాలో నియోజకవర్గాల వారీగా పోలింగ్ వివరాలు**

| నియోజకవర్గం | మొత్తం ఓట్లు | పోలైనవి | శాతం |
|---|---|---|---|
| దేవరకొండ | 2,51,622 | 2,12,593 | 84.49 |
| నాగార్జునసాగర్ | 2,33,412 | 2,00,235 | 85.79 |
| మిర్యాలగూడ | 2,31,391 | 1,93,185 | 83.49 |
| నల్లగొండ | 2,44,460 | 1,99,479 | 81.60 |
| మునుగోడు | 2,52,648 | 2,32,158 | 91.89 |
| నకిరేకల్ | 2,50,547 | 2,17,149 | 86.71 |
| మొత్తం | 14,64,080 | 12,54,799 | 85.71 |

**2023, 2018, 2014 ఎన్నికల్లో పోలింగ్ శాతం వివరాలు**

| నియోజకవర్గం | 2023 | 2018 | 2014 |
|---|---|---|---|
| దేవరకొండ | 84.49 | 85.98 | 75.91 |
| నాగార్జున సాగర్ | 85.79 | 86.44 | 79.63 |
| మిర్యాలగూడ | 83.49 | 84.57 | 79.26 |
| నల్లగొండ | 81.60 | 84.13 | 74.69 |
| మునుగోడు | 91.89 | 91.07 | 81.37 |
| నకిరేకల్ | 86.71 | 88.53 | 79.10 |
| మొత్తం | 85.71 | 86.82 | 78.41 |

**పురుషుల ఓటింగ్ అధికం**

జిల్లాలో ఓటేసిన వారిలో మహిళల కంటే పురుష ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. వాస్తవంగా మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువ ఉండగా.. ఓటేయడంలో మాత్రం వారు వెనుకబడ్డారు. పురుష ఓటర్లు 7,26,169 మంది ఉంటే 6,27,521 మంది (86.42శాతం) ఓటింగ్‌లో పాల్గొన్నారు. మహిళా ఓటర్ల సంఖ్య 7,37,789 ఉండగా.. 6,27,201 (85.01శాతం) మంది ఓటేశారు. పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్లు 1.41శాతం తక్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నట్లు తెలుస్తున్నది. ఇక ట్రాన్స్‌జెండర్ల ఓట్ల సంఖ్య 122 కాగా, 77 మంది ఓటేశారు.

### విశ్లేషణలు.. అంచనాలు

పోలింగ్ కేంద్రాల వారీగా పోలైన ఓట్ల లెక్కలు తేలడంతో అభ్యర్థులంతా విశ్లేషణలపై దృష్టి సారించారు. శుక్రవారం రోజంతా తమ పార్టీ నేతలు, అనుచరులతో చర్చల్లో మునిగితేలారు. పోలింగ్ కేంద్రాలు, గ్రామాల వారీగా వివరాలు తెప్పించుకుని ఎవరికి అనుకూలంగా ఓటింగ్ జరిగిందనే దానిపై చర్చ చేశారు. పోలైన ఓట్లలో ఎవరికి ఎంత మేరకు పడి ఉండవచ్చన్న అంచనాలు రూపొందించినట్లు తెలిసింది. దీని ఆధారంగా ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే తమ అనుచరులతో గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ ఎలా ఉన్నా రేపు జరిగే కౌంటింగ్‌పైనే అందరిలో ఉత్కంఠ నెలకొంది.

# కౌంటింగ్‌కు చకచకా ఏర్పాట్లు

**రేపు ఉదయం 8గంటల నుంచి లెక్కింపు**

నియోజకవర్గానికి ఒక హాల్ కేటాయింపు
ఒక్కో రౌండ్‌లో 14 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు
పోలింగ్ కేంద్రాలు బట్టి రౌండ్ల సంఖ్య
ముందుగా పోస్టల్ బ్యాలెట్లు, ఆపై ఈవీఎంలు
సిబ్బందికి రెండు దఫాలుగా శిక్షణ పూర్తి
అనిశెట్టి దుప్పలపల్లి గోదాముల్లో ఏర్పాట్లు
స్ట్రాంగ్ రూం వద్ద పటిష్ట భద్రత.. సీసీ కెమెరాల నిఘా

నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : శాసన సభ ఎన్నికల కౌంటింగ్ ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు మొదలు కానుంది. ఇందుకోసం తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లి గోదాముల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం సాయంత్రం పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలన్నింటినీ ఇక్కడికే తరలించి స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూమ్స్ వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. అయితే రేపు జరుగనున్న కౌంటింగ్ కోసం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ నేతృత్వంలో ఏర్పాట్లు పూర్తి కావచ్చాయి. ఇప్పటికే ప్రాథమిక ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. కౌంటింగ్ సజావుగా సాగడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున విశాలమైన ఆరు హాళ్లను కౌంటింగ్ కోసం ఎంపిక చేశారు. ఒక హాల్‌లో ఒకేసారి 14 టేబుళ్ల మీద 14 పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్ల లెక్కింపు పూర్తి కానుంది. కౌంటింగ్ టేబుళ్ల వద్ద కౌంటింగ్ సిబ్బందితో పాటు అభ్యర్థులు లేదా వారి కౌంటింగ్ ఏజెంట్లు కూర్చోవడానికి అనువుగా ఏర్పాట్లు చేస్తున్నారు.



నల్లగొండ దుప్పలపల్లి గోదాములో కౌంటింగ్‌కు చేసిన ఏర్పాట్లు

### ఒక్కో రౌండ్‌లో 14 పోలింగ్ కేంద్రాల ఓట్ల లెక్కింపు

ఆదివారం ఉదయం 8గంటలకు అభ్యర్థులు లేదా వారి ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్స్ ఓపెన్ చేస్తారు. రౌండ్ల వారీగా ఈవీఎంలను కౌంటింగ్ హాళ్లలోకి తీసుకొస్తారు. అదే సమయంలో ఆర్‌ఓ టేబుల్ వద్ద పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపును ప్రారంభిస్తారు. వీటి లెక్కింపు అనంతరం ఈవీఎంల ఓట్ల లెక్కింపును మొదలు పెడతారు. ఒక్కో హాల్‌లో ఒక నియోజకవర్గానికి సంబంధించిన మొత్తం 14 టేబుళ్లపై 14 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన 14ఈవీఎంలను ఓపెన్ చేస్తారు. అంటే ఒక్కో రౌండ్‌లో 14 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు పూర్తి కానుంది. ఇలా ఆయా నియోజకవర్గాల వారీగా ఉన్న పోలింగ్ కేంద్రాలను బట్టి రౌండ్ల సంఖ్య తేలనుంది. ఆయా నియోజకవర్గాల్లోని ఒకటో నెంబర్ పోలింగ్ కేంద్రం నుంచి చివరి పోలింగ్ కేంద్రం వరకు వరుస క్రమంలో ఈ లెక్కింపు కొనసాగనుంది. అన్నీ పూర్తయ్యాక చివరలో డ్రా పద్ధతిలో ఐదు పీఎస్‌లకు సంబంధించిన వీవీ ప్యాట్ స్లిప్పులను కూడా లెక్కించాకే తుది ఫలితం వెల్లడిస్తారు.



నల్లగొండలో కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్

### దేవరకొండలో అత్యధికంగా 23 రౌండ్లు

నియోజకవర్గాల వారీగా ఉన్న పోలింగ్ కేంద్రాల సంఖ్యను బట్టి లెక్కింపు పూర్తి కానుంది. దేవరకొండలో 310 పోలింగ్ కేంద్రాలు ఉండగా దీని ఫలితం 23 రౌండ్ల లెక్కింపుతో పూర్తి కానుంది. తర్వాత మునుగోడులో 307 పోలింగ్ కేంద్రాలు, నకిరేకల్‌లో 305, నాగార్జునసాగర్‌లో 299 పీఎస్‌లు ఉండగా.. వీటి లెక్కింపు 22 రౌండ్లల్లో పూర్తి కానుంది. నల్లగొండలో 284 పీఎస్‌లు ఉండగా 21 రౌండ్లు, మిర్యాలగూడలో 263 పీఎస్‌లు ఉండగా 19 రౌండ్లల్లో లెక్కింపు చేపట్టనున్నారు. అయితే.. తక్కువ మంది అభ్యర్థులు బరిలో ఉన్న చోట లెక్కింపు త్వరగా పూర్తి కానున్నది. కౌంటింగ్ ప్రారంభంలో తొలి అర్ధగంట కొంత ఆలస్యమైనా గంటకు సగటున మూడు రౌండ్ల ఫలితాలు వెల్లడి కావచ్చని అంచనా. ఉదయం 11 గంటల వరకే ఫలితాల ట్రెండ్ వెల్లడి కానుంది. లెక్కింపు పూర్తి కావాలంటే మాత్రం మధ్యాహ్నం 2 గంటల వరకు ఆగాల్సిందే.

### సిబ్బందికి శిక్షణ పూర్తి

ఇప్పటికే కౌంటింగ్ సిబ్బందికి మూడు దఫాలుగా శిక్షణ పూర్తి చేశారు. కౌంటింగ్ సిబ్బందితోపాటు మైక్రో అబ్జర్వర్లు కూడా ఇందులో ఉన్నారు. ఒక్కో కౌంటింగ్ టేబుల్‌కు ఒక కౌంటింగ్ సూపర్‌వైజర్, అసిస్టెంట్ కౌంటింగ్ సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్ ఉండనున్నారు. ఇక టేబుళ్లకు మరోవైపు ఒక్కో అభ్యర్థికి టేబుల్‌కు ఒకరి చొప్పున ఒక్కో కౌంటింగ్ ఏజెంటు ఉండనున్నారు. కౌంటింగ్ ఏజెంట్ల నియామక ప్రక్రియ కూడా నేడు పూర్తికానుంది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్‌తోపాటు ఆయా రిటర్నింగ్ అధికారులు, కేంద్రం నుంచి వచ్చిన పరిశీలకుల పర్యవేక్షణలో కౌంటింగ్ కొనసాగనుంది. ఇక కౌంటింగ్ వద్ద మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. ఇప్పటికే స్ట్రాంగ్ రూమ్ వద్ద సీఆర్‌పీఎఫ్ బలగాలతో పటిష్ట భద్రతను ఏర్పాటు చేయగా 24గంటల పాటు సీసీ కెమెరాల పర్యవేక్షణ కూడా కొనసాగుతుంది. ఓట్ల లెక్కింపునకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ప్రకటించారు. ఆదివారం ఉదయం 8గంటల నుంచి కౌంటింగ్ మొదలవుతుందని, ముందుగా పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్, ఆ తర్వాత ఈవీఎంల లెక్కింపు చేపట్టనున్నట్లు తెలిపారు.

# ఎవరి ధీమా వారిదే..

## ఓట్ల లెక్కల్లో మునిగి తేలుతున్న అభ్యర్థులు



సూర్యాపేట, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ పూర్తి కావడంతో జిల్లాలోని ప్రధాన పార్టీల అభ్యర్థులు లెక్కలతో కుస్తీలు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులంతా పేపరు, పెన్నులు పట్టుకొని పోలింగ్ ఏజెంట్లతో సమావేశమై ఈవీఎంలలో ఉన్న ఓట్లను తమకు ఎన్ని పడ్డాయో చర్చించుకుంటున్నారు. ఎన్నికలు పూర్తి కావడంతో అభ్యర్థులు పెట్టిన ఖర్చులు, వారికి పడిన ఓట్ల లెక్కలు చూసుకుంటుండగా ప్రజలు మాత్రం ఎన్నికల్లో ఎవరు గెలవబోతున్నారనే దానిపై ఎక్కడ చూసినా చర్చలు కనిపిస్తున్నాయి. జిల్లాలోని కొంతమంది అభ్యర్థులైతే తాము పెట్టిన ఖర్చు లెక్కలు వేసుకొని గుండెలు బాదుకుంటూ తలలు పట్టుకుంటున్నట్లు సమాచారం. నామినేషన్లు వేసిన నాటి నుంచి పోలింగ్ పూర్తయ్యే వరకు ప్రచారాలు, మైకులు, జెండాలు, కండువాలు ఇలా ప్రతిదానికి చేసిన ఖర్చులతోపాటు చివరి అంకంలో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఇచ్చిన డబ్బుల లెక్కలు చూసుకుంటున్నారు. కొంతమంది అభ్యర్థులు 50 నుంచి 60 కోట్లు ఖర్చు చేయగా ఒకరిద్దరైతే రూ.75 కోట్ల మార్క్ దాటినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆ మేరకు ఓట్లు పడలేదని లెక్కలు వేసుకొని గుండెలు బాదుకునే పరిస్థితి వచ్చినట్లు తెలుస్తుంది. ముందస్తుగానే ఎన్నికల కోసం డబ్బు జమ చేసి పెట్టుకోగా రోజురోజుకు వ్యయం పెరుగుతూ రాగా ఒకరిద్దరు తమ ఆస్తులను తాకట్టు పెట్టారు. తెలిసిన వారి నుంచి దొరికిన కాడికి అప్పులు తెచ్చారు. ఇప్పుడు ఎంత ఖర్చు అయ్యిందో లెక్కలు చూసుకుంటూ అనుకున్న దానికి రెండింతలు పెరిగిందని తెలిసి కండ్లు బైర్లు గమ్మే స్థితికి వచ్చినట్లు తెలుస్తుంది. ఇలాంటి అభ్యర్థులు ఉమ్మడి జిల్లాలో ఏడుగురు ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే అభ్యర్థులు మాత్రం ఎవరికి వారే 10 నుంచి 15వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు ఎక్కడ గుమిగూడినా ఆ అభ్యర్థికి అంత సీన్ లేదు.. అన్ని ఓట్లు పడవని, పలానా అభ్యర్థి గెలువడం ఖాయమని చర్చించుకుంటూ చాలెంజ్‌లు చేస్తున్నారు.

### ఏ నలుగురు కలిసినా.. ఆ ముగ్గురి ముచ్చటే

**ఎవరికెన్ని ఓట్లు పడ్డాయి.. ఎవరు గెలుస్తారని చర్చలు**

సూర్యాపేట, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : శాసన సభ ఎన్నికలు గురువారం పూర్తి కాగా.. ఎక్కడ చూసినా ఎవరు గెలవబోతున్నారనే దానిపైనే చర్చలు చేస్తున్నారు. సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో బరిలో నిలబడ్డ అభ్యర్థుల్లో ఎవరు గెలుస్తారు.. ఎవరు ఓటమి పాలవుతారంటూ చర్చించుకుంటున్నారు. ఒక ప్రాంతం వారు మరో ప్రాంతానికి ఫోన్లు చేస్తూ ఆరా తీస్తున్నారు. సూర్యాపేటలో సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి జగదీశ్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి దామోదర్‌రెడ్డి, బీజేపీ తరపున సంకినేని వెంకటేశ్వర్‌రావు ప్రధాన పోటీదారులుగా ఉండగా.. వీరిలో ఎవరు గెలుస్తున్నారనే దానిపై విపరీతమైన చర్చ జరుగుతున్నది. ఏ పార్టీకి ఎంత బలం ఉన్నది.. ఏఏ వర్గాలు ఏ పార్టీ వైపు మొగ్గు చూపాయి? అనేదానిపై ఎత్తున చర్చ వినిపిస్తున్నది. సూర్యాపేట పట్టణంతోపాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడ నలుగురు గుమిగూడినా ప్రధాన అభ్యర్థులుగా బరిలో ఉన్న ఈ ముగ్గురి గురించే మాట్లాడుకుంటున్నారు. చివరి నిమిషంలో ఓ అభ్యర్థి రెండున్నర కోట్లు పెట్టి ఓట్లు కొనుగోలు చేశాడట అని ఒకరంటే.. తండాలు, గ్రామాల్లో ఒక్కో ఓటుకు రూ.వెయ్యి నుంచి రూ.3వేల వరకు ఇచ్చారనే చర్చ వినిపిస్తున్నది. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఏ అభ్యర్థి ఎన్ని కోట్లు ఖర్చు చేశారు.. ఎవరు గెలవబోతున్నారు? ఏ మండలంలో ఎవరికి మెజార్టీ రాబోతున్నదనే దానిపై చర్చోప చర్చలు జరుగుతున్నాయి. మరి ఎవరి అంచనాలు నిజమవుతాయో తేలాలంటే మరో రోజు వేచి చూడాల్సి ఉంది.

### సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో కౌంటింగ్



సూర్యాపేట కౌంటింగ్ కేంద్రంలో చేసిన ఏర్పాట్లు

సూర్యాపేట, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల ఓట్లను సూర్యాపేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో లెక్కించనున్నారు. ఇందుకోసం అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నది. ప్రతి నియోజకవర్గానికి ఒక ఆర్‌ఓ టేబుల్‌తోపాటు ప్రతి రౌండ్‌కు 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ నిర్ణయం మేరకు ఈ సారి పోస్టల్ బ్యాలెట్, ఈవీఎంల కౌంటింగ్ ఒకేసారి ప్రారంభించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ కోసం ప్రతి నియోజకవర్గానికి ఒక టేబుల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 1201 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. సూర్యాపేటలో 271, తుంగతుర్తిలో 326, కోదాడలో 296, హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 308 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఈ లెక్కన సూర్యాపేటలో 20 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి కానున్నది. కోదాడలో 23, తుంగతుర్తి, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు సంబంధించి 22 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి కానుంది. కౌంటింగ్ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. కౌంటింగ్ కేంద్ర లోపల, బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

# పోలింగ్ శాతంలో రాష్ట్రంలోనే యాదాద్రి జిల్లా ఫస్ట్

**90.36 శాతం నమోదు**

జిల్లాలో ఓటెత్తిన చైతన్యం.. 90.36శాతం నమోదు
ఆలేరులో 90.77శాతం.. భువనగిరిలో 89.91శాతం
బొమ్మలరామారంలో అత్యధికంగా 93.64 శాతం పోలైన ఓట్లు
అత్యల్పంగా ఆలేరులో 86.41శాతం పోలింగ్
స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచినన ఈవీఎంలు



యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 4,50,207 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుషులు 2,24,326, మహిళా ఓటర్లు 2,25,861 మంది ఉండగా, 20మంది ఇతరులు ఉన్నారు. గురువారం మొత్తం 4,06,804 మంది ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు. భువనగిరి నియోజకవర్గంలో 2,16,941మంది ఓటర్లు ఉండగా, 1,96,060 ఓట్లు (89.91శాతం) నమోదయ్యాయి. 2018లో ఇక్కడ 90.53శాతం ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ 1,07,618 మంది పురుషులు ఉండగా, 9,75,72మంది ఓట్లేశారు. 1,09,322మంది మహిళలు ఉండగా, 97,488 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇతరులు ఒకరు ఉండగా, ఓటు నమోదు కాలేదు. ఆలేరు నియోజకవర్గంలో 2,33,266 మంది ఓటర్లుండగా, 90.77శాతంతో 2,11,744మంది ఓట్లేశారు. ఇందులో 1,16,708 మంది పురుషులకు గాను 1,07,278 మంది పోలింగ్‌లో పాల్గొన్నారు. 1,16,539 మంది మహిళా ఓటర్లు ఉండగా, 1,04,447 మంది ఓటేశారు. 19మంది ఇతరులు ఉండగా, అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. ఆలేరులో 2018 ఎన్నికల్లో 91.33 శాతం పోలింగ్ నమోదైంది. కాగా, గురువారం రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. సాయంత్రం 5గంటల వరకు లైన్‌లో నిలబడ్డ వారికి ఓటేసేందుకు అవకాశం కల్పించారు. పోలింగ్ పూర్తయ్యాక పోలీస్ బందోబస్తు నడుమ ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు.

### 93.64శాతంతో బొమ్మలరామారం టాప్

బొమ్మలరామారం మండలంలో 93.64శాతంతో అత్యధికంగా ఓట్లు పోలయ్యాయి. ఈ మండలం జిల్లాలోనే టాప్ ప్లేస్‌లో నిలిచింది. ఇక్కడ మొత్తం 28,698 ఓట్లు ఉండగా, 26,868 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. భూదాన్ పోచంపల్లి మండలం 92.71 శాతంతో రెండో స్థానంలో నిలిచింది. ఆ తర్వాత వరుసగా తుర్కపల్లిలో 92.70శాతం, గుండాలలో 92.43 ఆత్మకూర్.ఎంలో 92.19శాతం, వలిగొండలో 91.89శాతం, బీబీనగర్‌లో 91.80శాతం, మోటకొండూరులో 91.41శాతం పోలింగ్ నమోదైంది. ఇక ఆలేరులో అతి తక్కువగా 86.41శాతం, భువనగిరిలో 86.48శాతం ఓట్లు పోలయ్యాయి.